క్లుప్తంగా

ఓపెన్ ఇంటర్, టెన్త్‌లో అడ్మిషన్లు పొందాలి

నర్సంపేట : చదువు మధ్యలో ఆపేసిన, ఇన్ సర్వీస్ ఉద్యోగుల కోసం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్లు పొందాలని ప్రధానోపాధ్యాయులు ఎం.శాంతకుమారి తెలిపారు. ఈ మేరకు పట్టణంలోని జెడ్పీఎస్ఎస్ మోడల్ స్కూల్‌లో బుధవారం సమావేశం నిర్వహించారు. పాఠశాలలో ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో హెచ్ఈసీ, సీఈసీ గ్రూప్‌లో అడ్మిషన్లు పొందుటకు కో ఆర్డినేటర్ పి.కుమారస్వామి(96401 62614), పాఠశాల పని దినాల్లో సంప్రదించి అడ్మిషన్ పొంది ఉచిత పాఠ్య పుస్తకాలు తీసుకోవాలన్నారు.

భూకబ్జాపై విచారణ



పర్వతగిరి : మండలంలోని కల్లెడలో గౌడ సంఘానికి చెందిన భూమి కబ్జాకు గురైందని సోమవారం కొందరు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వరంగల్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ సూపరింటెండెంట్ మురళీధర్ బుధవారం కల్లెడ గ్రామంలో విచారణకు వచ్చారు. ఈ సందర్భంగా గౌడ సంఘం సభ్యులు తమ భూమి కబ్జాకు, ఆక్రమణకు గురి కాలేదని, 2019లో సంఘం అవసరం మేరకు విక్రయించడం జరిగిందని ఎక్సైజ్ అధికారులకు రాతపూర్వకంగా తెలిపారు. కార్యక్రమంలో వర్ధన్నపేట ఎక్సైజ్ సీఐ స్వరూప, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బీసీలు ఏకతాటిపై రావాలి



నర్సంపేట : స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా బీసీలంతా ఏకతాటిపై రావాలని బీసీ రాజ్యాధికార సమితి జిల్లా ఇన్‌చార్జ్ వంగ రవియాదవ్ కోరారు. అనేక రకాలుగా మోసపోతున్న ప్రజలను చైతన్యవంతులను చేయడం కోసం బీసీ రాజ్యాధికార సమితి కృషి చేస్తోందని ఆయన తెలిపారు. నర్సంపేట పట్టణంలో బుధవారం నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు సిలువేరు ద్రోణాచారి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. మండల కొమ్మాలు, చీర పద్మ, రమేశ్, సిలువేరు మానస, ఓదెల రంజిత్, సాంబలక్ష్మి, ఐలమ్మ, నగేష్, రమ, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధ దంపతులకు చేయూత



నల్లబెల్లి : రాంపూర్ గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు మేకల రాములు-కనకమ్మకు ఉబుంటు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి, పంతులుపల్లి పాఠశాల హెచ్‌ఎం కర్ణకంటి రాంమూర్తి బుధవారం రూ.10వేలు ఆర్థికసాయంతో పాటు నిత్యావసరాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వృద్ధదంపతుల దయనీయ పరిస్థితిని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నరేష్ సంస్థ దృష్టికి తీసువచ్చినట్లు చెప్పారు. పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి ఉడుత రాజేందర్, ఉపాధ్యాయుడు కూసమల్ల రాజన్‌బాబు, స్థానికులు గొనేల సాంబయ్య-సాంబలక్ష్మి పాల్గొన్నారు.

పరామర్శ



గీసుకొండ : మండలంలోని మరియపురం గ్రామానికి చెందిన గంటా శేషగిరిరావు(50) మంగవారం సాయంత్రం బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందాడు. కాగా బుధవారం మాజీ సర్పంచ్ అల్లం బాలిరెడ్డి.. శేషగిరిరావు మృతదేహాన్ని సందర్శించి సంతాపం తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి రూ.20వేల నగదును అందజేశారు.

జీపీ కార్యదర్శికి మెమో

సాక్షి ఎఫెక్ట్..

సంగెం : మండలంలోని రామచంద్రాపురం గ్రామ పంచాయతీ కార్యదర్శి సునీతకు ఎంపీఓ కొమురయ్య మెమో జారీ చేశారు. బుధవారం సాక్షి దినపత్రికలో 'అక్రమ వెంచర్లు-అడ్డగోలు అమ్మకాలు' శీర్షికతో నిబంధనలు పాటించని వెంచర్లపై ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన మండల పంచాయతీ అధికారి కొమురయ్య జీఓ నంబర్ 67 ప్రకారం లేఅవుట్‌లో మౌలిక సదుపాయాలు, రహదారుల నిర్మాణం లేకుండా విక్రయాలు చేపట్టడం, అనుమతి లేకుండా ప్రహరీ నిర్మాణం వల్ల సుమారు ప్రభుత్వానికి రూ.5లక్షల వరకు నష్టం వాటిల్లినా ఎందుకు నిలువరించలేక పోయారని షోకాజ్ నోటీస్ జారీ చేశారు. అనుమతి లేకుండా జరిగిన నిర్మాణం, జరగని అభివృద్ధి పనులపై తీసుకున్న చర్యలతో మూడ్రోజుల్లో వివరణ ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శికి మెమో జారీ చేశారు.

'భూభారతి'కి దరఖాస్తుల వెల్లువ

- ఈసారైనా సమస్యలు పరిష్కారమవుతాయని ఆశాభావం
- మండలంలో 4,470 దరఖాస్తులు



సంగెం రైతు వేదికలో దరఖాస్తు చేసుకుంటున్న రైతులు

సంగెం : భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఏళ్ల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి అలసిపోయిన అన్నదాతలు భూభారతిలో తమ భూ సమస్యలు పరిష్కారం అవుతుందనే నమ్మకంతో అర్జీలు పెట్టుకున్నారు. స్థానిక తహసీల్దార్ గనిపాక రాజ్‌కుమార్, నాయబ్ తహసీల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రెండు బృందాలుగా 17 రెవెన్యూ గ్రామాల్లో 22 సదస్సులు నిర్వహించారు. గ్రామాల్లో చాలా వరకు రైతులు నిరక్షరాస్యులుగా ఉండడంతో వారికి ఉపయోగపడేలా హెల్ప్ డెస్‌లు ఏర్పాటు చేసి ఉచితంగా దరఖాస్తు పత్రాలు అందించడంతో పాటుగా వారి సమస్యలను అక్కడే హెల్ప్ డెస్క్ అధికారులు రాసి తీసుకున్నారు. రైతుల నుంచి వచ్చిన వినతులను స్వీకరించి కేటగిరీల వారిగా విభజించారు. ఇందులో ఎక్కువగా సాదాబైనామా, సర్వేనంబర్ల మిస్సింగ్, పీటీటీలు, పాసు పుస్తకంలో తప్పులు, ఓఆర్‌సీ, సక్సెషన్, మ్యూటేషన్ పెండింగ్, డీఎస్ పెండింగ్, విస్తీర్ణం తక్కువగా ఉండడం, అసైన్డ్ భూములు, నిషేధిత జాబితా నుంచి తొలగించడం, రెవెన్యూ సర్వే కోసం, వారసత్వ పట్టా అమలు, తమ భూములు వేరేవారు పట్టా చేయించుకున్నారనే సమస్యలు ఎక్కువగా వచ్చాయి.

గ్రామాల వారీగా వచ్చిన దరఖాస్తులు..

చింతలపల్లి-550, సంగెం-457, మొండ్రాయి-401, పల్లారుగూడ-396, నల్లబెల్లి-393, ఎల్గూర్ రంగంపేట-367, గవిచర్ల-289, షాపూర్-253, తీగరాజుపల్లి-252, కాపులకనిపర్తి-222, నార్లవాయి-171, రామచంద్రాపురం-167, లోహిత-159, ముమ్మడివరం-146, కాట్రపల్లి-135, తిమ్మాపూర్-58, వెంకటాపూర్-54 మొత్తం 4,470 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలపారు. కాగా గతంలో సాదాబైనామాలో మీసేవ తదితరాల్లో దరఖాస్తులు చేసుకున్నవారు సైతం మళ్లీ దరఖాస్తులు చేసుకున్నారు. ఇంకా ఆయా గ్రామాల్లోని సదస్సుల్లో ఇవ్వనివారు సైతం వంద సంఖ్యలో దరఖాస్తులు ఇస్తున్నారు. ఈ నెల 20వ వరకు దరఖాస్తులు తీసుకుంటామని తహసీల్దార్ రాజ్‌కుమార్ పేర్కొన్నారు.

సందిగ్ధంలో అన్నదాతలు..

భూములకు సంబంధించిన సమస్యలపై రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తు చేసుకున్న రైతులు ఈ సారైనా పరిష్కారం లభిస్తుందా లేదా అనే సందిగ్ధంలో ఉన్నారు. గతంలో దరఖాస్తు చేసుకున్నా భూ సమస్యలకు పరిష్కారానికి నోచుకోలేదని భూ భారతి చట్టంలోనైనా తమ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

వేరే వాళ్లు పట్టా చేసుకున్నారు



మా తండ్రి పేరిట ఉన్న భూమిని మాకు తెలియకుండా వేరే వాళ్లు పట్టా చేయించుకున్నారు. ఖాస్తులో మాత్రం మేమే ఉన్నాం. మా భూమి మాకు పట్టా కావాలని ఏళ్ల తరబడి తిరుగుతున్నా కావడం లేదు. ఈ సారైనా పరిష్కారం అవుతుందని ఆశతో చూస్తున్న.

\- మెట్టుపల్లి ఉప్పలయ్య, రైతు, సంగెం

1992లో కొన్నది పట్టా కాలేదు



1992లో మా తాత కొనుగోలు చేసిన భూమి మా పేరిట పట్టా కావడంలేదు. అది వేరే వాళ్ల పేరుతో ఉంది. సదరు రైతు చనిపోయినా, అతని వారసులు మాకు పట్టా చేయించడం లేదు. మేం కొనుగోలు చేసినట్లు దరఖాస్తు చేసుకున్నాం. విచారణ చేసి న్యాయం జరిగేలా అధికారులు చూడాలి.

\- ఎర్ల సతీష్, రైతు, సంగెం

కలెక్టర్‌కు నివేదిస్తాం..



భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలపై రైతులు దరఖాస్తులు చేసుకున్నారు. వాటిని కేటగిరీల వారీగా విభజిస్తున్నాం. సంబంధిత రైతులకు నోటీసులు జారీ చేసి విచారణ చేపట్టి నివేదిక తయారు చేస్తాం. వాటి పరిష్కారం కోసం కలెక్టర్‌కు నివేదిస్తాం.

\- గనిపాక రాజ్‌కుమార్, తహసీల్దార్

'ప్రజా సమస్యల పరిష్కారానికి పల్లెబాట'



మాట్లాడుతున్న ఝాన్సీరెడ్డి

రాయపర్తి : నియోజక వర్గంలోని ప్రజా సమస్యల పరిష్కారానికి పల్లెబాట చేపట్టినట్లు పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీరాజేందర్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పోతిరెడ్డిపల్లి, దరియా తండా గ్రామాల్లో నిర్వహించిన పల్లెబాట కార్యక్రమంలో పాల్గొనగా ఆమెకు నాయకులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వర్ధన్నపేట : విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మండల పరిధిలోని కొండూరు, నందనం, అన్నారం, ఐనవోలు, కూనూరు ఫీడర్ల పరిధిలోని నేడు (గురువారం) ఉదయం 8నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వర్ధన్నపేట ఏఈ తరుణ్ తెలిపారు. అలాగే మైలారం, రాయపర్తి, వర్ధన్నపేటలలో ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

'ఎమ్మెల్యే కృషి అభినందనీయం'

వర్ధన్నపేట : గత పాలకుల నిర్లక్ష్యం, రాజకీయ అవినీతితో అభివృద్ధికి దూరమైన వర్ధన్నపేట నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ నియోజవర్గ అధికార ప్రతినిధి నిమ్మాని శేఖర్ రావు తెలిపారు.

విలువైన వస్తువులు ఇంట్లో దాచుకోవద్దు

దుగ్గొండి : మండలంలోని ప్రజలు తమతమ బంధువుల ఇళ్లకు, తీర్థయాత్రలకు వెళ్లినప్పుడు విలువైన వస్తువులను వెంట తీసుకెళ్లడంతో పాటు ఇంటికి తాళం వేసే విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై రావుల రణధీర్‌రెడ్డి సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇళ్లు విడిచి వెళ్లే వారు తాళం వేసేటప్పుడు సెంటర్ లాకింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

పర్వతగిరి : కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన చేవేళ్ల డిక్లరేషన్‌ను (ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్) అమలు చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అరూరి కుమార్ కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ..ఈనెల 22, 23 తేదీల్లో జరిగే కేవీపీఎస్ జిల్లా శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలను ఆవిష్కరించారు. జిల్లా ఉపాధ్యక్షుడు ఉసిల్ల కుమార్, సహాయ కార్యదర్శి ఉదయ్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన హెచ్‌ఆర్సీ నాయకులు

నర్సంపేట : చెన్నారావుపేట తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన దిలావర్ మహ్మద్ అబిద్‌అలీని నేషనల్ హ్యూమన్ రైట్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగెం రమేశ్, అధికార ప్రతినిధి నర్మెట్ట యాదగిరి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మండల అధ్యక్షురాలు గంగిడి కవిత, ప్రధాన కార్యదర్శి జక్క వెంకన్న, కార్యదర్శి బండి పద్మ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి వివేక్‌కు ఎమ్మెల్యే శుభాకాంక్షలు

వర్ధన్నపేట : రాష్ట్ర భూగర్భ గనులు, కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రిగా గడ్డం వివేక్ వెంకటస్వామి బాధ్యతలు స్వీకరించారు. ఈమేరకు హైదరాబాద్‌లోని సచివాలయంలో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కుమార్‌తో పాటు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

సన్మానం

రాయపర్తి : మండల విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన వి.శ్రీనివాస్‌ను స్థానిక ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం ప్రతినిధులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఎంఈఓ మాట్లాడుతూ విద్యాప్రగతికి నిబద్ధతో పాటుపడాలని సూచించారు.

బీఆర్ఎస్‌కు పూర్వ వైభవం

రాయపర్తి : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి పూర్వ వైభవం ఖాయమని మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని కొండూరులో పార్టీ గ్రామ అధ్యక్షుడు దేశబోయిన ఉపేందర్, మాజీ సర్పంచ్ రవీందర్ రెడ్డి అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు.

ఏబీవీపీ నగర కార్యదర్శిగా కార్తీక్

వర్ధన్నపేట : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ వరంగల్ మహానగర కార్యదర్శిగా మండలంలోని కట్య్రాలకు చెందిన బెల్లం కార్తీక్ ఎన్నికైనట్లు వరంగల్ విభాగ్ సంఘటన కార్యదర్శి కుంట హర్షవర్ధన్ ప్రకటించారు. బుధవారం హనుమకొండలోని సామ జగన్‌మోహన్ స్మారక భవన్‌లో నూతన కార్యవర్గ ఎన్నిక జరిగినట్లు పేర్కొన్నారు.

పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలి

నర్సంపేట : నర్సంపేట డివిజన్‌లో పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి మార్త నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు నర్సంపేట ఆర్డీఓకు బుధవారం సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. అనంతరం నాగరాజు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో కార్పొరేట్ విద్య పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తూ సామాన్య ప్రజల నడ్డి విరుస్తున్నారని పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని హాస్టళ్లలో కనీస సదుపాయాలు కల్పించాలని అన్నారు. ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా కమిటీ సభ్యులు కల్లెపల్లి రాకేష్, ఏఐఎఫ్‌డీడబ్ల్యూ జిల్లా కమిటీ సభ్యులు మార్త సుధ పాల్గొన్నారు.

ఎములాడ వెళ్లొచ్చేలోపు..

- బంగారం, వెండి ఆభరణాలు చోరీ
- వివరాలు సేకరించిన క్లూస్ టీం



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న నర్సంపేట రూరల్ సీఐ సాయిరమణ

నల్లబెల్లి : వేములవాడ దర్శనానికి వెళ్లి వచ్చే లోగా ఇల్లు గుల్లయింది. 4.8 తులాల బంగారం, 8 తులాల వెండి, రూ.2 వేల నగదు చోరీకి గురైన ఘటన నల్లబెల్లి మండల కేంద్రంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మార్త నరేష్ కిరాణం షాపు నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ నెల 15వ తేదీ రాత్రి ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో వేములవాడ దైవ దర్శనానికి వెళ్లి అక్కడే బస చేశారు. తిరిగి 17న రాత్రి ఇంటికి చేరుకున్నారు. ఇదే అదునుగా భావించిన దొంగలు ఇంటి తాళం తొలగించి లోపలికి చొరబడ్డారు. బీరువాలో దాచిపెట్టిన బంగారం, వెండి ఆభరణాలు, నగదును దోచుకు వెళ్లారు. విషయం తెలిసిన వెంటనే నర్సంపేట రూరల్ సీఐ సాయిరమణ, క్లూస్ టీం ఘటన స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించింది. సీఐ వెంట ట్రెయినీ ఎస్సై తేజ ఉన్నారు. బాధితుడు నరేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై లక్ష్మారెడ్డి చెప్పారు.

యాదవులకు మంత్రి పదవి ఇవ్వాలి

- బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం



మాట్లాడుతున్న రాజారాంయాదవ్

నర్సంపేట : రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న యాదవులకు కేబినెట్‌లో చోటు లేకపోవడం సిగ్గుచేటని బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు డి.రాజారాం యాదవ్ పేర్కొన్నారు. పట్టణంలోని యాదవ సంఘం కార్యాలయంలో బుధవారం యాదవ సంఘం జాక్ నర్సంపేట నియోజకవర్గ బాధ్యుడు, బీసీ ప్రజా సంఘాల రాష్ట్ర నాయకుడు ఆబోతు రాజుయాదవ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజారాం యాదవ్ మాట్లాడుతూ ఎమ్మెల్యేలు లేరనే సాకుతో యాదవ జాతిని వెనకబాటుకు గురి చేయొద్దన్నారు. వెంటనే మంత్రి పదవి ఇవ్వాలని కోరారు. హైదరాబాద్‌లో ఈనెల 30న జరిగే యాదవుల ఆత్మగౌరవ సభకు భారీ సంఖ్యలో తరలి రావాలని కోరారు. అనంతరం ఆత్మగౌరవ సభ పోస్టర్లను ఆవిష్కరించారు. లొడంగి గోవర్ధన్, కృష్ణ, సిద్దిరాజ్, వేణు,అశోక్, ముఖేష్, బండి పర్వతాలు, శ్రీకాంత్, అక్షయ్ పాల్గొన్నారు.

చంద్రబాబు, రేవంత్‌ది ఒకటే బుద్ధి

- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

ఖానాపురం : రాజకీయంగా చంద్రబాబు, రేవంత్‌రెడ్డిలది ఒకటే బుద్ధి ఉంటుందని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. మండల కేంద్రంలో బుధవారం బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఉద్యమ సమయంలో తుపాకులు పట్టుకోని తిరిగినోడికి తెలంగాణ పాలన ఎలా అర్థమవుతుందని మండిపడ్డారు. నర్సంపేట నియోజకవర్గంలో నాడు గ్యారంటీ, నేడు చీటింగ్ అంటూ హామీలతో కూడిన 76 వేల ప్రింట్‌లు తీసి గడప గడపకు పంచుతామన్నారు. ఎమ్మెల్యే మాధవరెడ్డి ప్రవర్తన సరిగా లేదని దుయ్యబట్టారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ ప్రకాశ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, సొసైటీ చైర్మన్ రామస్వామి, పార్టీ మండల అధ్యక్షుడు వెంకటనర్సయ్య, వేజెళ్ల కిషన్‌రావు, బంధారపు శ్రీనివాస్, సుధాకర్, మస్తాన్, మౌలానా, బాలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ కార్యకర్తలకే ఇందిరమ్మ ఇళ్లా..'



దివ్యాంగురాలు నిర్మలతో కార్పొరేటర్ మనీషా, బీఆర్ఎస్ నాయకులు

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ గరీబ్‌నగర్‌కు చెందిన లింగంపెల్లి నిర్మల సొంతింటి కల సాకారం కావడం లేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గృహలక్ష్మి కింద ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇవ్వగా పిల్లర్ల వరకు తాను, తన భర్త కూలి పనులు చేసిన నిర్మించామని, అయితే ఎన్నికల కోడ్‌తో తనకు ఇల్లు మంజూరు కాలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పరకాల ఎమ్మెల్యేను కలిసి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయ మంటే ఇల్లు మంజూరు కాదని చెప్పాడని ఆమె బుధవారం విలేకరుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ సుంకరి మనీషా, బీఆర్ఎస్ నాయకుడు సుంకరి శివకుమార్, పోగుల సంజీవ తదితరులు ఆమె వద్దకు వెళ్లి మాట్లాడారు. అనంతరం వారు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే కాంగ్రెస్ నాయకులకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులు బొజ్జం భిక్షపతి, నర్సింహ, ఎస్కే ఆజాద్, బొంత రవి, ఏడాకుల మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొట్ట కూటికి.. పగటి వేషం



తొగర్రాయిలో వివిధ వేషధారణతో భిక్షాటన చేస్తున్న పగటి వేషగాళ్లు

దుగ్గొండి : తెలంగాణ రాష్ట్రం విభిన్న కళలు, కళాకారులు, సంస్కృతుల సమ్మేళనం. పురాతన సంస్కృతీ సంప్రదాయాలను కొనసాగిస్తూ అనేక కులాల వారు తమ కళలను ప్రదర్శిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో తొర్రూరుకు చెందిన పత్రి వీరభద్రచారి తన నలుగురు కుమారులు, 16 మంది కుటుంబ సభ్యులతో ఐదు రోజులుగా మండలంలోని తొగర్రాయి గ్రామంలో పగటి వేషాలు వేస్తూ భిక్షాటన చేస్తున్నారు. మొదటిరోజు ఫకీర్ సాహెబ్ వేషం, రెండో రోజు వీరబ్రహ్మం, మూడో రోజు కాళికామాత నల్ల పోచమ్మ, నాలుగో రోజు లంబాడీ, ఐదో రోజు బేతాలుడి వేషం వేసి ఇంటింటికి వెళ్లి ఆర్థికసాయం కోరుతున్నారు. అయితే మొదటి నాలుగు రోజులు ఎవరినుంచి ఎలాంటి డబ్బులు తీసుకోరు. ఐదో రోజు మాత్రం ఇంటింటికి వెళ్లి భిక్షాటన ద్వారా డబ్బు సేకరిస్తుంటారు. ఈ సందర్భంగా పత్రి వీరభద్రచారి మాట్లాడుతూ తమ కులంలో చాలా మంది ఇతర వృత్తులు ఎంచుకోగా తమ కుటుంబం మాత్రం పూర్వీకుల నుంచి వచ్చిన ఆచారాన్ని కొనసాగిస్తూ జీవనం సాగిస్తున్నామన్నారు. ప్రభుత్వం కనుమరుగమవుతున్న తమ కళను గుర్తించి జీవం పోయాలని కోరారు.

క్రీడా పాఠశాలకు ఎంపిక

పర్వతగిరి : క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు బుధవారం మండల స్థాయి ఎంపిక పూర్తయినట్లు ఎంఈఓ లింగారెడ్డి తెలిపారు. మండలంలోని ఆర్డీఎఫ్ కల్లెడ పాఠశాలలో విద్యార్థులకు పలుఅంశాల్లో పరీక్షలు నిర్వహించి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా లింగారెడ్డి మాట్లాడుతూ.. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు ఈనెల 24, 25 తేదీల్లో జిల్లా స్థాయిలో ఎంపికలు ఉంటాయని అన్నారు. మన్నం వెంకటేశ్వర్లు, పర్వతగిరి మండల ఫిజికల్ డైరెక్టర్లు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు హెచ్‌ఎం శ్రీనివాస్, జనార్దన్, ఎమ్మార్సీ సీసీఓ జయరాజ్, తదితరులు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ' నిర్మాణాలు పూర్తిచేయాలి



నెక్కొండ: లబ్ధిదారులకు ఇంటి మంజూరు పత్రాలు అందజేస్తున్న రంజిత్‌రెడ్డి తదితరులు



పర్వతగిరి: ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పర్వతగిరి : ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసి బిల్లులు పొందాలని ఎంపీడీఓ మాలోత్ శంకర్ నాయక్ సూచించారు. మండలంలోని నారాయణపురం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను బుధవారం ఎంపీఓ శేషాంజనేయులుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శంకర్‌నాయక్ మాట్లాడుతూ లబ్ధిదారులు త్వరగా బేస్‌మెంట్ లెవల్ పూర్తి చేసిన వారికి మొదటి విడత రూ.లక్ష చెక్కును ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతాయని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల భూమి పూజ, ముగ్గుపోసి లబ్ధిదారులను ఆశీర్వదించారు.

ఇందిరమ్మ నిర్మాణాలు వేగవంతం చేయాలి

సంగెం : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎంపీడీఓ కాసర్ల రవీందర్ ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఇందిరమ్మ ఇళ్లపై సమీక్ష నిర్వహించారు. పనులు ప్రారంభించిన వారు వేగంగా నిర్మాణాలు చేపట్టేలా పంచాయతీ కార్యదర్శులు లబ్ధిదారులను ప్రోత్సహించాలని సూచించారు. ఎంపీఓ కొమురయ్య పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు నిబంధనలు పాటించాల్సిందే

నెక్కొండ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నిబంధనలు పాటించాల్సిందేనని టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం మండలంలోని పత్తిపాక, మడిపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఆయన భూమి పూజ చేశారు. మండల అధ్యక్షుడు బక్కి అశోక్, ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు లావుడ్యా తిరుమల్ చౌహాన్, నాయకులు కేవీ సుబ్బారెడ్డి, కుసుమ చెన్నకేశవులు, రావుల మహిపాల్‌రెడ్డి, గుంటుపల్లి ప్రభాకర్‌రావు, బొల్లె బోయిన సురేశ్, రాజు, బా లాజీ, వెంకన్న, తులసీరాం, ప్రసాద్ పాల్గొన్నారు.

నెరవేరుతున్న పేదల సొంతింటి కల

నల్లబెల్లి : కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సొంతింటి కలను నెరవేరుస్తోందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు చిట్యాల తిరుపతి రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ముచ్చింపులలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందించి ఇంటి నిర్మాణ పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మాలోత్ రమేష్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఇస్తారి శేఖర్, నాయకులు ఆంగోత్ పూల్‌సింగ్, బొట్ల ఇంద్రసేన, పాలకుర్తి శ్రీనివాస్, కృష్ణవేణి, బత్తిని రవి, ధర్మారం మల్లయ్య, బొట్ల సారయ్య, ఎండీ సర్వర్ మియా తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

నర్సంపేట : నర్సంపేటలోని 11వ వార్డుకు చెందిన కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ వడ్డె కుమారస్వామి తండ్రి వీరయ్య ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి బుధవారం మృతుడి చిత్రపటం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, యాకూబ్‌రెడ్డి, సందీప్, రవికుమార్, వంశీకృష్ణ, మధుకర్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

నర్సంపేట పట్టణంలోని 8వ వార్డుకు చెందిన వేల్పుల సాంబయ్య, 7వ వార్డుకు చెందిన గద్దల కొమురయ్య ఇటీవల మృతి చెందారు. కాగా నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్, పట్టణ ప్రచార కార్యదర్శి, మాజీ కౌన్సిలర్లు మండల శ్రీనివాస్, బండి ప్రవీణ్, పెండెం వెంకటేశ్వర్లు, గందె చంద్రమౌళి, ఆకుల ప్రభాకర్, జన్ను సురేందర్, కందికొండ శ్రీను, బగ్గి రాజు, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

నిప్పురవ్వలు ఎగసిపడి గుడిసె దగ్ధం



నర్సంపేట రూరల్ : కల్లు మండువలో ప్రమాదవశాత్తు గుడిసె దగ్ధమైన సంఘటన నర్సంపేట మండలంలోని రాజుపేట శివారు చింతగడ్డ తండా సమీపంలోని సాకరిమూలలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. నర్సంపేటకు చెందిన గీత కార్మికులు సాకరిమూల సమీప వనంలో తాటి చెట్లు ఎక్కి కుటుంబాలను పోషించుకుంటున్నారు.రోడ్డుపక్కనే తాటాకులు, గడ్డితో గుడిసె వేసుకోని గీత కార్మికులు మోకులు, కత్తులు భద్రపరుస్తుంటారు. ఈక్రమంలో సమీపంలోని వ్యవసాయ భూమిలో గడ్డిని కాలుస్తుండగా నిప్పురవ్వలు ఎగిసిపడి కల్లు మండువలోని గుడిసెపై పడడంతో పూర్తిగా దగ్ధమైందని, వెంటనే స్థానికులు ఫైరింజన్‌కు ఫోన్ చేయడంతో సిబ్బంది వచ్చి మంటలు ఆర్పేలోపే పూర్తిగా కాలిపోయింది. సుమారు రూ.40వేల వరకు నష్టం వాటిల్లిందని గీతకార్మికులు తెలిపారు.